


సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com T/TG/2024/1225/9690/1229




ప్రచురణ: హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 31 ఎడిటర్ : పాలగోని రాజేష్ సోమవారం 24 -02-2025 పేజీలు : 8 వెల : 4-00

# శ్రీశైలం పర్యటనకు గవర్నర్ అబ్దుల్ నజీర్..



నంద్యాల:సూర్యటుడే ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం శ్రీశైలం రానున్నారు. సాయంత్రం 3 గంటలకు ప్రత్యేక హెలికాప్టరులో శ్రీశైలం వస్తారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకోనున్నారు. రాత్రికి శ్రీశైలంలో గవర్నర్ బస చేస్తారు. మంగళవారం ఉదయం శ్రీశైలం నుంచి విజయవాడకు బయలుదేరి వస్తారు. కాగా శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆరోవరోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం ఆలయంలో శ్రీస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆది దంపతులు సాయంత్రం పుష్పపల్లకిలో ఆశీనులై ప్రత్యేక పూజలందుకొనున్నారు. రాత్రి క్షేత్ర పురవీధుల్లో శ్రీస్వామి అమ్మవార్లకు పుష్పపల్లకిలో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

శ్రీశైలానికి కాలినడకన ఎంపీ శబరి..

కాగా శ్రీశైలంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

మిగతా 2లో

# నేటి నుంచి శాసనసభ సమావేశాలు!

●రచ్చ కాదు..చర్చకు వేదిక కావాలి ● గత సంప్రదాయాలను పునరుద్ధరించాలి
●గతంలో ఏడాదికి 60 రోజులు సమావేశాలు ● వైసీపీ హయాంలో 30-40 రోజులతో సరి
● బడ్జెట్‌లో పద్దులపై చర్చలు జరిగిందే లేదు ●మొక్కుబడిగా ప్రశ్నోత్తరాలు, జీరో అవర్
● నాడు.. దాడి, బూతులు, దూషణలతో రచ్చ ● నేడు.. సభ ప్రతిష్ఠను నిలబెట్టాల్సిన అవసరం
● నేడు గవర్నర్ ప్రసంగంతో శ్రీకారం





**అమరావతి, సూర్యటుడే న్యూస్**
శాసనసభ బడ్జెట్ సమావేశాలకు సోమవారమే శ్రీకారం! గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో సభ లాంఛనంగా ప్రారంభమవుతుంది. సుమారు 20 పనిదినాలు అసెంబ్లీ నిర్వహించే అవకాశముందని తెలుస్తోంది. అదే సమయం లో... శాసనసభకు సంబంధించి గత సంప్రదాయాలను పునరుద్ధరించే బాధ్యత కూడా కూటమి సర్కారుపై ఉందనే అభిప్రాయం వినిపిస్తోంది. జగన్ హయాంలో ఐదేళ్లపాటు శాసనసభ అంటే 'చర్చకు కాదు, రచ్చకు వేదిక' అన్నట్లుగా మారింది. చంద్రబాబుతోపాటు నాటి విపక్ష నేతలపై విరుచుకుపడటం, బూతులతో దాడి చేయడం, నోరెత్తకుండా మైకులు కట్టేయడం... ఇదీ పరిస్థితి! చివరికి... 'ఇది కౌరవ సభలా మారింది. గౌరవ సభలా మారేదాకా ఇక్కడ అడుగు పెట్టను' అంటూ చంద్రబాబు ప్రతిజ్ఞ చేసి మరీ బయటికి వచ్చేశారు. అన్నట్లుగానే ముఖ్యమంత్రి హోదాలో మళ్లీ సభలో అడుగు పెట్టారు. అటు... జగన్ మాత్రం తనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తామంటూ భీష్మించుకు కూర్చున్నారు. అనర్హత వేటు భయంతో సోమవారం మాత్రం వైసీపీ సభ్యులు సభకు వస్తున్నారు. ఆ తర్వాతి సంగతిపై స్పష్టత లేదు.

మిగతా 2లో

# టన్నెల్ లోపల ఇరుకుగా బురద

●టీబీఎం నుంచి 400 మీటర్ల వరకు కూరుకుపోయిన మట్టి, ఐరన్ షీట్లు
●నిమిషానికి 3500 లీటర్ల దాకా
● వస్తున్న ఊటనీరు
●సవాల్‌గా మారిన నీటి తొలగింపు
●3 రోజులపాటు సహాయక చర్యలు కొనసాగితేనే పరిస్థితి కొలిక్కి!
●ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, హైడ్రా ఆధ్వర్యంలో సహాయక చర్యలు
● 2.5 మీటర్ల ఎత్తున పేరుకున్న బురద
●సహాయక చర్యలపై సీఎం ఆరా
●సీఎం రేవంత్‌కు రాహుల్ ఫోన్
●కార్మికులను రక్షించేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ వదులుకోవద్దని సూచన



మహబూబ్‌నగర్/**సూర్యటుడే న్యూస్**/అచ్చంపేట/ దోమలపెంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గంలో పైకప్పు కూలిన ఘటనలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు చిక్కుకోవడంతో.. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, హైడ్రా, ఇండియన్ ఆర్మీ, స్పెషల్ బెటాలియన్ల ఆధ్వర్యంలో శనివారం రాత్రి 10.30 గంటల నుంచి సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం వరకు మూడు బృందాలు లోపలికి వెళ్లాయి. అయితే సొరంగంలో దాదాపు 2.5 మీటర్ల నుంచి 3 మీటర్ల ఎత్తున బురద పేరుకుపోవడం, నిమిషానికి 3500 లీటర్ల వరకు ఊటనీరు వస్తుండటం, ప్రమాదం జరిగిన తర్వాత పేరుకుపోయిన నీరు నిల్వ ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవు తున్నాయి. దాదాపు 13 కిలోమీటర్ల వరకు విద్యుత్తు సరఫరాను, వైఫైని పునరుద్ధరించగా.. అక్కడి వరకు ఆక్సిజన్ సరఫరా నిర్విరామంగా కొనసాగుతోంది. టన్నెల్ లోపల ఇరుకుగా ఉండటం, దిగువన బురద కారణంగా అడుగు తీసి అడుగు వేయలేని స్థితి ఉండటంతో.. సహాయక చర్యలకు ఎక్కువ బృందాలను తీసుకెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.

టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) నుంచి దాదాపు 400 మీటర్ల వరకు మట్టి కూరుకుపోయిందని సహాయక చర్యల్లో పాల్గొని తిరిగివచ్చిన వారు చెబుతున్నారు. దీంతో లోపల చిక్కుకున్నవారి పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని భావిస్తున్నారు. పెద్ద ఎత్తున బురద పేరుకుపోవడం, వారు ఉన్న వైపునకు గాలి సరఫరా లేకపోవడం, ప్రమాదం

మిగతా 2లో

# ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బంగారు గోపుర ఆవిష్కరణ మహోత్సవం

● 50.5 అడుగుల ఎత్తైన పంచతల గోపుర తాపడానికి.. 68కిలోల పసిడి వినియోగం
● సీఎం రేవంత్ దంపతుల ప్రత్యేక పూజలు
●5 రోజులుగా గుట్టపై జపాలు, పారాయణలు హోమాలతో ఉత్సాహపూరిత వాతావరణం
●ఆదివారం దివ్య విమాన రాజగోపురానికి మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం
● సీఎం పర్యటనకు దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్, మంత్రుల గైర్హాజరుపై చర్చ



భువనగిరి **సూర్యటుడే న్యూస్**
భక్తుల కొంగుబంగారమై యాదగిరిగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బంగారు గోపుర ఆవిష్కరణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ అమృత ఘడియల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న భక్తజనకోటికి స్వర్ణమయ దివ్య విమాన రాజగోపురం దర్శనమిచ్చింది. ఐదురోజులుగా జపతపాదులు, హోమాలు, పారాయణలు,

మిగతా 2లో

# రాష్ట్రంలో ఎరువుల లభ్యతపై విమర్శలు

## రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి తుమ్మల సూచన



హైదరాబాద్, **సూర్యటుడే న్యూస్** రాష్ట్రంలో ఎరువుల లభ్యతపై విమర్శలు చేయకుండా కేంద్రం నుంచి ఎరువులను తెప్పించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రంలో రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని బీజేపీ పెద్దలు ఎరువుల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు మద్దతిస్తే మంచిదన్నారు. ఇప్పటికే ఎరువుల సరఫరాకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కోరినట్టు తెలిపారు. ఆదివారం వ్యవసాయ అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరంలేదన్నారు. ఈ వారంలో మరో 81,800 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని తెలిపారు. గత యాసంగికంటే ఈసారి 2.59 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. కేంద్రం నుంచి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రాష్ట్రానికి 6.81 లక్షల మెట్రిక్ టన్నులే వచ్చిందన్నారు. ఎరువుల విషయంలో కేంద్రంతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని, ఎరువులు పంపాలంటూ కేంద్రానికి తాను లేఖలు కూడా రాస్తున్నట్టు చెప్పారు.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక
సోమవారం 24 ఫిబ్రవరి 2025

# నేటి నుంచి శాసనసభ సమావేశాలు!

(మొదటి పేజి (తరువాయి)


ఎన్నెన్ని రోజులు...
గతంలో శాసనసభ సమావేశాలు ఏటా సగటున 60 రోజులపాటు జరిగేవి. బడ్జెట్ సమావేశాలు 30 రోజుల దాకా నిర్వహించేవారు. అన్ని అంశాలు చర్చకు వచ్చేవి. బడ్జెట్ సమావేశాల్లో పద్దులపై చర్చ సందర్భంగా ఆయా రంగాలపై లోతైన చర్చ జరిగేది. విపక్షాల వాదనలు, ప్రభుత్వం తరపు సమాధానంతో సంబంధిత శాఖకు సంబంధించిన సమగ్ర చిత్రం ఆవిష్కృతమయ్యేది. కానీ... ఇప్పుడు చిత్రం మారిపోయింది. రానురాను 'సభా సమయం' చిక్కిపోతూ, మొక్కుబడి తంతులామారింది. జగన్ హయాంలో ఏడాదికి 30–40 రోజులు జరిగితేనే గొప్ప అన్నట్లుగా తయారైంది. బడ్జెట్ సమావేశాల విషయంలో వ్యవహరించాల్సిన సంప్రదాయాలను అటకెక్కించారు. గత ఐదేళ్లు పద్దులపై చర్చే జరగలేదు. అన్నీ గెలిటెన్ చేసి ఆమోదించడమే! ఇక... శాఖల సంగతులు ప్రజలకు తెలిసేదెలా? ఈ నేపథ్యంలో కూటమి సర్కారు అసెంబ్లీ సమావేశాల రోజులను పెంచాలని... బడ్జెట్ సమావేశాల్లో పద్దులపై సమగ్ర చర్చకు ఆస్కారం కల్పించాలని ప్రజాస్వామ్య వాదులు కోరుకుంటున్నారు.

ఆత్మస్తుతి... పరనింద!
జగన్ హయాంలో అసెంబ్లీని 'ఆత్మస్తుతి... పరనింద'కు వేదికగా మార్చేశారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా... 'అభినవ అంబేడ్కర్... నేటి గాంధీ' అని జగన్‌ను కీర్తించేందుకు వైసీపీ సభ్యులు, మంత్రులు పోటీపడ్డారు. ప్రశ్నోత్తరాలు అంతంత మాత్రమే! ఇక జీరో అవర్ మొక్కుబడిగా సాగేది. చాలామంది వైసీపీ సభ్యులే 'ఇదేం సభ' అని అంతర్గత చర్చల్లో వాపోయేవారు. ప్రస్తుతానికి వైసీపీ సభ్యులు శాసనసభ సమావేశాలకు పూర్తిగా హాజరయ్యే అవకాశం కనిపించడంలేదు. వచ్చినా... ఉన్నదే 11మంది కాబట్టి సభకు అంతరాయం కల్పించే స్థాయిలో 'ఆందోళనలు' చేయలేరు. ఈ నేపథ్యంలో అసెంబ్లీని పూర్తిస్థాయిలో అర్థవంతంగా నడిపించే బాధ్యత కూటమి సర్కారుపైపడింది. బడ్జెట్ సమావేశాలు 20 పనిదినాలు జరిగే అవకాశముండటంతో ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను స్పృశించే అవకాశం ఉంది. గతంలో ఎమ్మెల్యేలు తమ ప్రాంత సమస్యలను సభలో చెప్పేందుకు అవకాశం ఇచ్చేవారు. ఇప్పుడు కూడా ప్రతి ఎమ్మెల్యేకు తన నియోజకవర్గ సమస్యలు సభ దృష్టికి తెచ్చి పరిష్కరించే అవకాశం కల్పించాల్సి ఉంది. సోమవారం, మొదటిరోజు గవర్నర్ ప్రసంగం ఉం టుంది. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ చేపడతారు. దీనిని గతంలోలాగా ముఖ్యమంత్రిని కీర్తించే కార్యక్రమంలా మార్చకుండా అసలు వాస్తవాలు వివరించేలా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.
నాడు జరిగిందిలా..
అసెంబ్లీ సమావేశాల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం అంతకు ముందు ఉన్న సభా సంప్రదాయాలను పూర్తిగా పక్కనపెట్టింది. సభను దారిలో పెట్టాల్సిన స్పీకర్ సైతం జగన్ కనుసైగలతో ఓ పార్టీ సభలాగా నిర్వహించారు. సభలో అప్పటి ప్రతిపక్ష టీడీపీ సభ్యులెవరైనా ప్రజా సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తినప్పుడల్లా ఎదురుదాడికి దిగేవారు. బూతులు, దూషణలు, అవహేళనలతో సభా మర్యాదను మంటగలిపారు. కుటుంబ సభ్యులను, మహిళలను కించపరిచేలా దూషించారు. ఎన్నో కీలకాంశాలు... పలు పథకాలు నిధులు లేక నీరసిస్తున్నాయి. వాటికి జవసత్వాలు కల్పించేలా చర్చకు, చర్యలకు అసెంబ్లీని ఉపయోగించుకోవా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం తాలూకా పలు చట్టాలను రద్దు చేసి, మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆ వివరాలను, అవసరాన్ని ప్రజలకు వివరించాలి.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని మళ్లీ గాడిలో పెట్టడానికి పలు విజన్‌లను రూపొందించారు. మరీముఖ్యంగా 'స్వర్ణాంధ్ర – 2047' ఉద్దేశాలు, లక్ష్యాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు అసెంబ్లీని ఉపయోగించుకోవాలి.

రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన, లక్షలాది మంది రైతులను ఇక్కట్లలోకి నెట్టిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మార్గం కనుక్కోవాలి.

# శ్రీశైలం పర్యటనకు గవర్నర్ అబ్దుల్ నజీర్..



ఈ క్రమంలో కొందరు భక్తులు నల్లమల అటవీ మార్గం గుండా కాలినడకన శ్రీశైలానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నంద్యాల టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి కూడా భక్తులతో కలిసి నల్లమలలో కాలినడకన శ్రీశైలం దేవస్థానానికి బయల్దేరారు. ఆమె వెంట భద్రతా సిబ్బంది, అనుచరులు ఉన్నారు.
శ్రీశైల మల్లన్నకు చీరాల తలపాగా సిద్ధంకాగా శ్రీశైల మల్లన్నకు మహాశివరాత్రి నాడు ధరింపజేసే తలపాగాను తయారు చేసే మహదావకాశం బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురి పంచాయతీకి చెందిన పృథివి సుబ్బారావుకు దక్కింది. దశాబ్దాలుగా సుబ్బారావు పూర్వీకులే మల్లన్న తలపాగాను మగ్గంపై స్వయంగా తయారు చేసి స్వామి తలకు చుట్టే ఆనవాయితీ. ఇటీవల సుబ్బారావు తండ్రి వెంకటేశ్వర్లు అనారోగ్యంబారిన పడడంతో ఈ ఏడాది ఆ అవకాశం సుబ్బారావుకు దక్కింది. 3 నెలలు శ్రమించి 360 మూరల పొడవున్న తలపాగాను తయారు చేశారు. దాన్ని ఆదివారం సుబ్బారావు, దుర్గ దంపతులు శ్రీశైలంలోని స్వామి సన్నిధికి తీసుకెళ్లారు. పండుగ రోజు ఆలయంలో అన్ని ప్రధాన దీపాలు ఆర్పివేశాక పాగాను స్వామివారికి సుబ్బారావు చుట్టనున్నారు. శ్రీశైల మల్లన్న తలపాగాను దర్శించుకోవడం వల్ల సర్వలోపాలు, పాపాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం.

# ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బంగారు గోపుర ఆవిష్కరణ మహోత్సవం

(మొదటి పేజి (తరువాయి)

వేదమంత్ర పఠనంతో గుట్టపై నెలకొన్న ఉత్సవపూరిత వాతావరణం.. ఆదివారం మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంతో పతాకస్థాయికి చేరింది. ఈ వేడుకల్లో భాగంగా యాగశాలలో నిర్వహించిన మహాపూర్ణాహుతిలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు భక్తిప్రపత్తులతో పాల్గొన్నారు. అసలు ఘట్టమైన స్వామివారి
స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం.. వానమామలై మఠం 31వ మధుర కవి పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో మొదలైంది. జీయర్ అనుమతితో ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు మహాకుంభ కలశాన్ని శిరసున దాల్చి ఐదు అంతస్తుల ఎత్తున ఉన్న స్వర్ణ గోపురం వరకూ సుమారు 126 మెట్లెక్కారు. సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు క్రతువులో పాల్గొని స్వామివారి స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించారు. 50.5 అడుగుల ఎత్తు, 10.759 చదరపు అడుగుల వైశాల్యంలో ఉన్న విమాన గోపురానికి స్వర్ణతాపడం చేసేందుకు..68 కిలోల బంగారాన్ని వినియోగించారు.
మహోత్సవం కొనసాగిందిలా...
ఉదయం 11.09 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు యాదగిరిగుట్ట పట్టణంలో వైకుంఠద్వారం వద్దకు.. అక్కడి నుంచి ఘాట్ రోడ్డు వెంట కొండపైన అతిథిగృహానికి చేరుకున్నారు. అక్కడ సంప్రదాయ దుస్తులు ధరించి లిఫ్ట్ ద్వారా తిరువీధిలోకి చేరుకుని యాగశాలను సందర్శించి మహాపూర్ణాహుతిలో పాల్గొన్నారు. 14 నదుల నుంచి సేకరించిన నదీ జలాలతో కూడిన కలశంతో ఉత్తర రాజగోపురం నుంచి దక్షిణ తిరువీధిలో ఏర్పాటు చేసిన మెట్లదారి నుంచి స్వర్ణ గోపురం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన మెట్లెక్కి.. పూలతో అల్లిన తాడు సహాయంతో.. స్వర్ణ దివ్య విమాన (గాలి) గోపురాన్ని సీఎం 11.54 గంటలకు ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన చక్రానికి నదీ జలాలతో మహాకుంభాభిషేక సంప్రోక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే అక్కడినుంచి త్రితల గోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి, గండభేరుండ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు సీఎంకు పూర్ణకుంభ స్వాగతం పలకగా.. గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అంతరాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు శేష వస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటం, స్వర్ణ గోపుర జ్ఞాపికను అందజేశారు. అనంతరం సీఎం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సీఎం వెంట ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, బాలునాయక్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. కానీ.. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ ఎన్. శ్రీధర్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సీఎం పర్యటనకు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది.
శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం
యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో అనుబంధ ఆలయమైన శ్రీ పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి చరమూర్తులు కొలువైన ఉప ఆలయంలో ఆదివారం విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనంతో మహాశివరాత్రి మహోత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారం పలికారు.

# టన్నెల్ లోపల ఇరుకుగా బురద

(మొదటి పేజి (తరువాయి)

జరిగి దాదాపు రెండు రోజులు అవుతుండటంతో అందరిలోనూ ఆందోళన నెలకొంది. లోపలికి వెళ్లివచ్చిన వారు కూడా.. సహాయక చర్యలు పూర్తయి, టన్నెల్‌లో చిక్కుకున్నవారి వద్దకు వెళ్లాలంటే కనీసం మూడు రోజుల సమయం పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం మూడో బృందంలో మధ్యాహ్నం ఒంటి గంటకు టన్నెల్ లోపలికి వెళ్లి సాయంత్రం 6.40 గంటలకు బయటకు వచ్చారు. అక్కడ నెలకొన్న పరిస్థితి ప్రకారం ఎన్ని రోజులు పడుతుందో స్పష్టంగా చెప్పలేమన్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని, చిక్కుకున్న వారిని కాపాడుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.
నిర్విరామంగా డీ వాటరింగ్ ప్రక్రియ..
సహాయక చర్యలకు ప్రధానంగా బురద, నీరు అడ్డంకిగా ఉండడంతో డీ వాటరింగ్ చేయడం సవాల్‌గా మారింది. లోపలికి వెళ్లివచ్చిన రెస్క్యూ బృందాల్లోని సభ్యులు కూడా ఇదే విషయం చెబుతున్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు నిల్వ ఉన్న బురద నీటిని తరలించడం కష్టంగా మారిందని అంటున్నారు. ఇప్పటికే డీ వాటరింగ్ కోసం అక్కడ 150 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్ ఉండగా, మరో 100 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్‌ను బిగించారు. నిమిషానికి దాదాపు 4500 లీటర్ల నీటిని బయటకు తోడుతున్నారు. పేరుకుపోయిన మట్టి.. లూజ్ బురదగా మారితే దానిని కూడా డీ వాటరింగ్‌లో భాగంగానే బయటకు తరలించే ప్రయత్నం చేస్తే సహాయక చర్యల్లో వేగం పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అయితే టన్నెల్ ఇరుకైనది కావడం కూడా సమస్యగా మారింది. టన్నెల్ దాదాపు 9 మీటర్ల వ్యాసంతో ఉంటుంది. ఇందులో ఎయిర్ పంపింగ్ కోసం పైపు లాంటి వ్యవస్థ ఉంటుంది. కిందివైపు.. పైపులు, విద్యుత్తు సరఫరా లైన్లు, మట్టి తరలించడానికి కన్వేయర్లు ఉంటాయి. ఈ ఇరుకు సొరంగంలోకి ఎక్కువ మంది వెళ్లి పనిచేయడానికి లేదా ఎక్స్‌కవేటర్లు, పెద్ద మెషినరీ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనడానికి అవకాశం లేదు. కేవలం 50 నుంచి 60 మంది మాత్రమే వెళ్లి పనిచేయడానికి వీలుంటుంది. సొరంగం లోపల బురద పేరుకుపోవడంతో.. సహాయక బృందాలు అందులోకి దిగి నడవడం కోసం తడకలను, లూజ్ బురద ఎక్కువగా ఉంటే అందులో నుంచి వెళ్లేందుకు థర్మకోల్ తెప్పలను, ఊటనీరు ఎక్కువగా వస్తే రక్షణ కోసం ట్యూబ్‌లను సహాయక బృందాలు లోపలికి తీసుకెళ్లాయి. మట్టికి అడ్డుగా ఐరన్ షీట్లు, రాడ్లు పడడంతో.. వాటిని కట్ చేయడానికి కట్టర్లు, గ్యాస్ సిలిండర్లు, విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ఇబ్బంది కాకుండా డీజిల్ జనరేటర్లను తీసుకెళ్లారు.

మంత్రులు, అధికారుల సమీక్షలు..

సహాయక చర్యలను పరిశీలించడానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఆదివారం ఉదయం 10.30గంటలకు జేపీ గెస్ట్‌హౌసకు వచ్చారు. అక్కడే అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. మంత్రి జూపల్లి దాదాపు ఐదు గంటలపాటు టన్నెల్‌లోనే ఉండి సహాయక చర్యలను పరిశీలించారు. మరోవైపు సహాయక చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సంబంధిత విభాగాలతో ఆరా తీశారు. కార్మికులను రక్షించేందుకు అన్నివిధాలా ప్రయత్నాలు కొనసాగించాలని అధికారులకు సూచించారు. కాగా, సహాయక బృందాలకు సహకారం అందించేందుకు సికింద్రాబాద్ బైసన్ డివిజన్ ఇంజనీర్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్) బృందాలు కూడా ఆదివారం రంగంలోకి దిగాయి.

సహాయక చర్యల్లో వందల మంది..
సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యల్లో భాగంగా భారత సైన్యం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడంతోపాటు రెండు ఆర్మీ హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్ నుంచి 120 మంది సహాయక చర్యల్లో పాల్గొంటుండగా, ఎస్డీఆర్ఎఫ్ నుంచి 70 మంది, సింగరేణి రెస్క్యూ టీం నుంచి 35 మంది, హైడ్రా నుంచి 15 మంది పాల్గొంటున్నారు. నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ సీఎస్ అరవింద్‌కుమార్, ఐఏఎస్ శ్రీధర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్లు సుదీశ్‌కుమార్, ప్రసన్న, పవన్, అగ్నిమాపక శాఖ నుంచి ఆర్ఎఫ్ హరినాథ్‌రెడ్డి, సింగరేణి రెస్క్యూ టీం చీఫ్ కలందర్ తదితరులు పాల్గొంటున్నారు. మొదటి టీంలో కేవలం 8 మంది మాత్రమే సొరంగంలోకి వెళ్లగా, రెండో టీంలో 23 మంది, మూడోసారి దాదాపు 50 మంది లోపలికి వెళ్లారు. జేపీ, రాబిన్ కంపెనీలు విద్యుత్తు, ఎయిర్, వాటర్, డీవాటర్ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. సాయంత్రం 6.40గంటలకు మంత్రి జూపల్లితోపాటు పది మంది బయటకు వచ్చారు.
రెస్క్యూ ఆపరేషన్ సాగుతోందిలా..

శనివారం రాత్రి 10:30 గంటలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది 8 మంది టన్నెల్ లోపలికి ట్రెయిన్ ద్వారా వెళ్లారు. 11.45 గంటలకు అక్కడికి చేరుకున్నారు. 12 కిలోమీటర్ల వరకు ట్రెయిన్‌లో వెళ్లి.. అక్కడి నుంచి కన్వేయర్ బెల్టు సాయంతో మరో కిలోమీటర్ వరకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. దాదాపు 300 మీటర్ల నుంచి 400 మీటర్ల వరకు మట్టి, సెగ్మెంట్ బ్లాకులు, ఐరన్ షీట్స్, టన్నెల్ సామగ్రి పేరుకుపోయినట్లు గుర్తించి రాత్రి 2:30 గంటలకు తిరిగి వచ్చారు. అర్ధరాత్రి దాటాక 3 గంటలకు సింగరేణి, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫకు చెందిన దాదాపు 23 మంది టీమ్ టన్నెల్ లోపలికి వెళ్లింది. వారు ఘటనా స్థలానికి దాదాపు 300 నుంచి 400 మీటర్ల దగ్గరి వరకు వెళ్లారు. అక్కడ దాదాపు 2.5 మీటర్ల ఎత్తు వరకు బురద ఉండటంతో.. అందులోకి దిగి నడవడం వీలు కావడం లేదని రెస్క్యూ టీంలో ఉన్న వ్యక్తులు తెలిపారు. 24 గంటలు షిఫ్టుల వారీగా మూడు రోజులపాటు సహాయక చర్యలు కొనసాగిస్తేనే లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం ఉందని కొందరు తమ అంచనాలను చెప్పారు. వారు ఆదివారం ఉదయం 9 గంటలకు తిరిగి వచ్చారు.

ఉదయం 10 గంటలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి జేపీ గెస్ట్‌హౌసకు వచ్చి.. అధికారులతో సమీక్ష నిర్వహించారు.

10.30 గంటలకు ఆర్మీతోపాటు ఇతర సహాయక బృందాలు లోపలికి వెళ్లాయి.

11.30 గంటల వరకు మంత్రులు, ఇతర అధికారులు టన్నెల్ ప్రాంతానికి చేరుకొని, అక్కడ సహాయక ఏర్పాట్లపై ప్రణాళికలను పరిశీలించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొరంగం లోపలికి అర కిలోమీటర్ వరకు వెళ్లారు.

మధ్యాహ్నం 1 గంటకు మరో బృందం లోపలికి వెళ్లగా.. అందులో మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా వెళ్లారు.

సాయంత్రం 5.30 గంటలకు రాబిన్ కంపెనీకి చెందిన ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్ 10 మంది తిరిగి వచ్చారు.

సాయంత్రం 6.40 గంటలకు మంత్రి జూపల్లి కృష్ణారావు టన్నెల్ నుంచి బయటకు వచ్చారు.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక
సోమవారం 24 ఫిబ్రవరి 2025

# ఎస్ ఎల్ బి సి టన్నల్ లో జరిగిన ప్రమాదం పై సమగ్ర విచారణ చేయాలి

:- కొమ్ము గణేష్



చండూర్ ఫిబ్రవరి 23 (సూర్య టుడే): ఎస్ ఎల్ బి సి దోమలపెంట దగ్గర జరుగుతున్న పనులలో పనిచేస్తున్న కూలిల పై ప్రమాదం సంభవించడం చాలా బాధాకరమైన విషయం, ఎనిమిది మంది కార్మికులు గల్లంతు అయ్యి 24 గంటలు గడుస్తున్న ఇప్పడి వరకు వారిని బయటకు తీయకురాకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యం అని సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ హ్యాఖ్యనిం చారు. గతంలో భారీ వర్షాలు కారణంగా అక్కడ మిషన్లన్నీ నీట మునిగిన విషయం తెలిసిందే అయిన ప్పటికీ హడావుడిన రాష్ట్ర ప్రభుత్వం పనులు మొదలుపెట్టి ముందస్తు జాగ్రత్తలు లేకుండా ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయో కనిపెట్టకుండా నిన్న జరిగిన ప్రమాదానికి కారణమమైందినీ అన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి గుత్తేదారుగా ఉన్న జయప్రకాష్ నారాయణ పూర్తి బాధ్యత వహించాలి అని అన్నారు.

# యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

-మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి
-వి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం
-క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ





యాచారం సూర్య న్యూస్ (ఫిబ్రవరి 23):. క్రీడాకారులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి అని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలో నంది వనపర్తి లో శివరాత్రి పండుగ సందర్భంగా మాజీ సర్పంచ్ వర్త్యవత్ రాజ్ నాయక్, ఆయన తల్లి రూప్లి బాయ్, జ్ఞాపకార్థంగా వి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటును మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... యువకులు క్రీడా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం, ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. క్రీడాకారులకు టీ షర్ట్స్ రాజు నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. శివరాత్రి పండుగ పురస్కరించుకొని గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, జర్కోని రాజు, కొండాపురం శ్రీశైలం, సర్దార్ గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



చండూర్ ఫిబ్రవరి 23 (సూర్య టుడే):
గట్టుప్పల మండల కేంద్రంలో చేనేత కార్మికుడు బోల్ల రామచంద్రం బిజెపి పార్టీ కార్యకర్త రెండు కిడ్నిలు చెడిపోయి అనారోగ్యం పాలై కుటుంబ పోషణ భారంగా మారి, డయాలిసిస్ చేయించుకుంటున్నారు అతని ఆరోగ్యస్థితి గమనించి. భారతీయ జనతా పార్టీ అందరి కార్యకర్తల సహకారంతో 25000/- రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాపోలు గోపినాథ్, సూరేపల్లి సత్తయ్య, కొంగరి పాండు, కొంగరి నరహరి, పగిళ్ళ శంకర్, గుర్రం ప్రదీప్ కుమార్, మండల శ్రవణ్ , సింగం భాస్కర్, మెట్టు లక్ష్మణ్ , సూరేపల్లి శ్రీనివాస్, సూరేపల్లి రామకృష్ణ, కార్యకర్తలు, కాలని వాసులు పాల్గొనీ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బొల్ల రామచంద్రం బార్య మాట్లాడుతూ మేము కష్టాలో ఉన్న అని తెలిసి మా సమస్యను తెలుసుకొని మాకు ఆర్థికంగా సహాయం చేసిన బీజేపీ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# మహాశివరాత్రి మహోత్సవ నికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

-ముఖ్య అతిథులు.. ఎమ్మెల్యే రంగారెడ్డి
- ముదిరెడ్డి కోదండ రెడ్డి రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్
-భక్తులందరూ వేలాదిమంది పాల్గొనాలి
-శివపార్వతుల కళ్యాణం.. బిలకంటి శేఖర్ రెడ్డి దంపతులు



యాచారం సూర్య న్యూస్ ( ఫిబ్రవరి 23):. మండల పరిధిలో నంది వనపర్తి గ్రామంలో ఫిబ్రవరి 26న మహాశివరాత్రి మహోత్సవానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని హైదరాబాదులో తిరుమల హిల్స్ లో మర్యాదపూర్వకంగ మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బి.యన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి కలిసి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నంది వనపర్తి లో ప్రతి సంవత్సరం వేలాదిమంది శివరాత్రి ఉత్సవాలకు హాజరవుతున్న సందర్భంగా.. సకల సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. శివరాత్రి రోజున ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు, వ్రతాలు కొనసాగిస్తారు. 27న ఉదయం నుండి అభిషేకాలు, అర్చనలు, విశేష బిల్వార్చనలు,
ఉదయం 11 గంటల 16 నిమిషాలకు శ్రీ సిద్దేశ్వర స్వామి కళ్యాణోత్సవం, తీర్థ ప్రసాదం, ఆశీర్వచన ము, స్వామివారి అన్నదాన ప్రసాదం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిలకంటి శేఖర్ రెడ్డి, అర్చన దంపతులు శివపార్వతుల కళ్యాణం వారి చేతుల మీదుగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా కోదండ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడేడ్ల వెంకట్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నర్రె భాష, ఆలయ కమిటీ సభ్యులు కాళ్ళ జంగయ్య,
పోచారం మహేందర్ రెడ్డి, కొండాపురం పాండు, బర్ల మల్లేష్, పంది సుధాకర్, యంజాల అంజయ్య, ముచ్చర్ల వెంకటరమణ, నూకం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రామేశ్వరంలో అమ్మ నాన్నల జ్ఞాపకర్తంగా కల్యాణమండపం నిర్మాణం

కార్యక్రమానికి హాజరైన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి






షాద్ నగర్ సూర్య టుడే న్యూస్ ప్రతినిధి (ఫిబ్రవరి 23) :అమ్మ నాన్నల జ్ఞాపకార్థంగా కళ్యాణ మండపం చేపట్టడం ఎంతో అభినందనీయమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిలు అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం రాయికల్ గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామీ దేవస్థానం ఆవరణలో కీ"శే " మంచి రేవుల జంగయ్య, బీమమ్మల జ్ఞాపకంగా వారి కుమారుడు మాజీ జెడ్పిటిసి మంచిరేవుల కళమ్మ, సాయి కృష్ణ దంపతులు నూతన కళ్యాణ మండపం నిర్మించి దేవాలయానికి అప్పగించారు.బాలానగర్ మండలంవీరన్నపల్లి గ్రామానికి చెందిన సాయికృష్ణ కుటుంబ సభ్యులు నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిలు కలిసి ప్రారంభించారు. అంతకుముందు రామేశ్వరం దేవాలయంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తో కలిసి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కళ్యాణమండపం నిర్మించినందుకు సాయి కృష్ణ కలమ దంపతులకు అభినందనలు తెలిపారు. కన్న తల్లిదండ్రులకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం అని జన్మనిచ్చిన తల్లిదండ్రులు లేని పక్షంలో వారి పేరిట ప్రజలకు సామాజిక సేవలు చేయడం కూడా ఎంతో పుణ్యం అని వారి పేరిట ఎన్ని సేవలు చేసిన తల్లిదండ్రులకు సేవ చేసుకున్నట్టేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి పురుషోత్తం రెడ్డి, ఆశన్న గౌడ్, నాయినోన్పల్లి చంద్రశేఖర్, మల్లికార్జున్, ప్రేమ్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు..

# 26 వ రోజు శివ స్వాములకు అన్న ప్రసాదం







షాద్ నగర్ సూర్య టుడే న్యూస్ (ప్రతినిధి 23):శివరాత్రి పండుగ పురస్కరించుకొని గజానంద్ మరాఠీయ వినాయక గంజి మరియు.. కడియాల శివకుమార్ పుట్టినరోజు సందర్భంగా శివ స్వాముల కు అన్నప్రసాదం. నిర్వహించారు ..శివరాత్రి పండుగ సందర్భంగా పూజా కార్యక్రమం నిర్వహించి శివ స్వాములకు అన్న ప్రసాదంపూజ నిర్వహించిన గురు స్వామి క్యామ మహేష్, శివ స్వామి, ఏన్నం నారాయణరెడ్డి గురుస్వామి బృందం శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయం బైపాస్ రోడ్ షాద్ నగర్ గుడిలో శివ స్వాములకు అన్నప్రసాదం పూజా కార్యక్రమాలు నిర్వహించిన . గజానంద్ మారాటి మరియు కడియాల శివకుమార్ మాట్లాడుతూ.. శివరాత్రి పండుగ సందర్భంగా శివ స్వాములకు అన్న ప్రసాదం చేయడం మా అదృష్టం అని అన్నారు. 25 రోజుల నుండి దాతల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమం ముందుండి పూజ కార్యక్రమం అన్న ప్రసాదం నడిపిస్తున్న,, నడి కూడా రఘునాథ్ యాదవ్, ను శివ స్వాములు అభినందిస్తున్నారు. నడికూడ సంతోష్ యాదవ్, జర్నలిస్ట్ ఏ.దర్శన్ గౌడ్ , చిన్నయ్య గారి వెంకటేష్ యాదవ్, రాజు యాదవ్, కే. నాగరాజు,అశోక్ యాదవ్, మరియు శివ స్వాములు శివ గురు స్వామి కృష్ణయ్య స్వామి, గురుస్వామి సత్యం స్వామి, మహేష్ స్వామి, కమ్మదనం నారాయణరెడ్డి నరేస్ స్వామి, విష్ణు స్వామి, పాల్గొన్నారు.

# మునుగోడు నియోజకవర్గంలో నిరంతర ప్రక్రియ గా కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరాలు



చండూర్ ఫిబ్రవరి 23 (సూర్య టుడే): మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో మూడో విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తో కలిసి పరిశీలించిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌం డేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి. నియోజ కవర్గంలో కంటి సమస్యల తో బాధపడుతున్న ప్రతి ఒక్క రికి మెరుగైన కంటి చూపు వచ్చేంతవరకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కి చెందిన శంకరా కంటి ఆసుపత్రి, ఫీనిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలకు అపురూపమైన స్పందన వస్తోందని అన్నారు.

# ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

-ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షులు హరికిషన్
-కుంభమేళాకు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు




యాచారం సూర్య న్యూస్ (ఫిబ్రవరి 23):. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మంత్రి పదవి ఇవ్వాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షులు గోరిగే హరికిషన్ కోరారు. ఆదివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కుంభమేళకు చేరుకున్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే రంగారెడ్డి 40 వేల అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు మూడుసార్లు ఎమ్మెల్యేగా అనుభవం ఉన్న నాయకుడని గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నం కి ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చిన మంత్రి పదవి దక్కలేదని వాపోయారు. జిల్లా అభివృద్ధి జరగాలంటే మల్రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి దక్కాల్సిందేనని కుంభమేళలో ఆ దేవున్ని మొక్కుకున్నారు.

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
సోమవారం 24 ఫిబ్రవరి 2025

## కరాటే పోటీలో ప్రతిభ చాటిన చండూర్ విద్యార్థులు





చండూర్ ఫిబ్రవరి 23 (సూర్య టుడే):
నల్గొండ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి సొటోకన్ కరాటే పోటీల్లో చండూరు పాఠశాలల విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ కారింగు రవి తెలిపారు. ఛాంపియన్ షిప్ పోటీలలో చండూరు నుంచి 30 మంది విద్యార్థులు గెలుపు పొందారని తెలిపారు. ఈ పోటీలకు చండూరు నుంచి గీత విద్యాలయం, గాంధీ విద్యాలయం, సన్ షైన్ స్కూల్, మరియానికేతన్, కస్తూర్బ గాంధీ స్కూల్, కృషవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్స్ రాపోలు సుదర్శన్, కల్లూరి నగేష్, నాగార్జున, శ్రీధర్ మాస్టర్లు కలిసి చండూరు పాఠశాలల విద్యార్థుల కరాటే మాస్టర్ కారింగు రవిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కరాటే పోటీలో గెలుపొందిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ పతకాలను అందజేశారు. కరాటే మాస్టర్ రవి మాట్లాడుతూ... కరాటే విద్యార్థుల ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుంది అన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక హజరత్ అబ్బాస్ షరీఫ్ దర్గా

### హజ్రత్ అబాస్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి.





చింతపల్లి,సూర్య టుడే న్యూస్ ప్రతినిధి ఫిబ్రవరి 23
మత సామరస్యానికి ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గా అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు.ఆదివారం చింతపల్లి మండలం పీకే మల్లెపల్లిలో హజ్రత్ అబ్బాస్ దర్గాలో ప్రత్యేక పార్ధనలు నిర్వహించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొంతం లావణ్య చంద్రశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాదేపల్లి నీరంజన్,మహేందర్, అమర్నాథ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.
న్యూస్ ఓవర్

## ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో ఇబ్రహీంపట్నం బాలికల ప్రతిభ

- హీరో సుమన్ చేతుల మీదుగా 40 మందికి మెడల్స్ అందజేత.
- బెస్ట్ కరాటే మాస్టర్ గా మంకాల అశోక్ కుమార్ కు అవార్డు.





ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి ఫిబ్రవరి 23సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ కరాటే పోటీలకు ముఖ్యఅతిథిగా హీరో సుమన్ తల్వార్ హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం కేంద్రం నుండి మూడు పాఠశాలలు, పోల్కంపల్లి,లింగంపల్లి, మంచాల్, ఆరుట్ల తదితర ప్రభుత్వ పాఠశాలల నుండి బాలికలు పోటీలలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ కరాటే అకాడమీ గ్రాండ్ మాస్టర్ శ్రీలక్ష్మి హీరో సుమన్ గౌడ్ చేతుల మీదుగా గోల్డ్, సిల్వర్, రజిత, పథకాలను అందించి విద్యార్థులను అభినందిం చారు. అనంతరం సుమన్ మాట్లాడు తూ.. .ఆత్మరక్షణకు కరాటే విద్య ఎంతో అవసరమైన శక్తిని ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని సినీ నటుడు హీరో సుమన్ తల్వార్ అన్నారు. తనను తాను రక్షించుకుంటూ ఇతరులను రక్షించడానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులు చిన్ననాటి నుంచే గ్రామస్థాయిలో కరాటే నేర్చుకునేలా చైతన్యవంతం చేయాలని కరాటే శిక్షకులకు ఆయన సూచించారు. అనంతరం బెస్ట్ కరాటే మాస్టర్ గా మంకాల అశోక్ కుమార్ కు సుమన్ తల్వార్ అవార్డును అందించారు.

## హజరత్ అబ్బాస్ షరీఫ్ దర్గాను దర్శించుకున్న మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల





చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి ఫిబ్రవరి 23 మత సామరస్యానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న హజరత్ అబ్బాస్ దర్గా షరీఫ్ 56వ ఉర్సు సందర్భంగా ఆదివారం మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండవ జాన్ పహాడ్ గా జిల్లాలో విలసిల్లు తున్న ఈ దర్గా మహిమా న్వితమని ప్రతి సంవత్సరం లక్షలాదిమంది దర్శించుకుని తరిస్తున్నారని అన్నారు.అనంతరం దర్గా కమిటీ సభ్యులు శాలువాలతో కొండ్రు పుష్పలీలను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా సంగారెడ్డి తహసీల్దార్ షేక్ ఫరీన్ కుటుంబ సభ్యులతో దర్గాను దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


తహసిల్దార్ కుటుంబ సభ్యులను సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ కె.వి రమేష్ రాజు, దర్గా ముత్తావల్లి మహమ్మద్ చాంద్ పాషా, సయ్యద్ పాష,యూసుఫ్ పాష, షరీఫ్, అభి, జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-2 మెయిన్స్ ప్రాథమిక కీ విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్ – 2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పేపర్ –1 పరీక్షకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆదివారం సాయంత్రం విడుదల చేసింది. ప్రాథమిక 'కీ' పై అభ్యంతరాలు ఉంటే %జూంఎ. ఖజూ.స్త్రశీజ.ఱఅ% వెబ్ సైట్ ద్వారా ఈ నెల 25 నుంచి 27వ తేదీ లోపు తెలపాలని ఏపీపీఎస్సీ సూచించింది. ఆదివారం నిర్వహించిన గ్రూప్ – 2 మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 92,250 మంది అభ్యర్థుల్లో 86,459 మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా, హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న వారిలో 92 శాతం మంది హాజరయ్యారు.

## నాకు ప్రత్యామ్నాయ మార్గాలున్నాయి..

### పార్టీ మార్పు వార్తలపై శశిథరూర్



- ప్రధాని మోదీని, కేరళ ప్రభుత్వాన్ని ప్రశంసించిన శశిథరూర్
- సొంత పార్టీలో కలకలం రేపిన వ్యాఖ్యలు
- ప్రతిసారీ పార్టీ ప్రయోజనాల కోసమే మాట్లాడలేనని స్పష్టీకరణ
- కేరళ సీఎం పదవికి తాను అర్హుడినన్న సీనియర్ నేత

తాను పార్టీ మారబోతున్నట్టు వస్తున్న వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. ప్రస్తుతానికి తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, పార్టీ కనుక తన సేవలను వినియోగించుకోకూడదని భావిస్తే తనకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని స్పష్టం చేశారు. శశిథరూర్ ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీని, కేరళలోని వామపక్ష ప్రభుత్వాన్ని ప్రశంసించారు. దీంతో సొంత పార్టీలో ఇవి కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ మారుతున్నారన్న ప్రచారం జరిగింది.ఈ ప్రచారంపై తాజాగా శశిథరూర్ స్పందించారు. దేశ, రాష్ట్ర విస్తృత ప్రయోజనాల కోసమే తాను అలా మాట్లాడానని, ప్రతిసారీ పార్టీ ప్రయోజనాల కోసమే మాట్లాడటం తనకు చేతకాదని తేల్చి చెప్పారు. తానెప్పుడూ సంకుచితంగా ఉండనని పేర్కొన్నారు. కేరళలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్త ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేయడం ద్వారా పార్టీని విస్తరించాలని పిలుపునిచ్చారు. లేదంటే వరుసగా మూడోసారి కూడా ప్రతిపక్షానికే పరిమితం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కేరళ ముఖ్యమంత్రి పదవికి తాను అర్హుడినని శశిథరూర్ పేర్కొన్నారు. పలు ఒపీనియన్ పోల్స్ కూడా ఇదే విషయాన్ని చెప్పాయని గుర్తు చేశారు.

## 15 వ వార్డు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదలు.



తుర్కయంజాల్,సూర్య టుడే : మొదటిసారిగా ఏర్పడిన తుర్కయంజాల్ మున్సిపల్ పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ గా వేముల స్వాతి అమరేందర్ రెడ్డి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వెంకటేశ్వర కాలనీ వాసులు సన్మానం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 5వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గా మొట్ట మొదటి సారిగా తనను గెలిపించిన వార్డు ప్రజలకు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్ రెడ్డి ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేశారు.మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గా తన గెలుపు కృషి చేసిన వార్డు ప్రజలకు తను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని మాజీ కౌన్సిలర్ స్వాతి అమరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రామిరెడ్డి,నరేందర్ రెడ్డి,సాయి గౌడ్,నరేష్ నాయక్,లక్ష్మణ్ నాయక్,రవి కుమార్,మహేష్, రమేష్ నాయక్,పరమేష్,సతీష్ రెడ్డి,పాండు,ఆంజనేయులు నాయక్,సాయి తదితరులు పాల్గొన్నారు.